RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 131 | ఏప్రిల్ 16, 2025 | వెల : రూ.3-00



ఏప్రిల్ 17న మందకృష్ణ మాదిగకు సన్మానం

4లో..



భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు

## అవగాహన కల్పించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, వరంగల్ :**

వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన భూభారతి నూతన రెవెన్యూ చట్టంపై తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,అదనపు కలెక్టర్ జి సంధ్యారాణిలు పాల్గొని భూభారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత తాసిల్దార్లను ఆదేశించడమైనది. ఏప్రిల్ 14 డాక్టర్ బి.ఆర్అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా హైదరాబాద్ శిల్పకళా వేదిక నందు భూభారతి పోర్టల్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ల తో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో భూభారతి చట్టం అమలు తీరుపై దిశ నిర్దేశాలని అమలుచేసే తీరును జిల్లా కలెక్టర్ ఆర్డీవోలు వివిధ మండలాల తాసిల్దార్లతో సమీక్ష నిర్వహించి ఏప్రిల్ 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాల నిర్వహణకు షెడ్యూల్ రూపకల్పనతో పాటు అన్ని ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. ప్రతి తహసిల్దార్ కార్యాలయంలో భూ భారతి చట్టం హెల్ప్ లైన్ నంబర్ 04029313999 ఏర్పాటు చేసి చట్టంపై ప్రజలకు సలహాలు, సూచనలు అందచేయాలని సూచించారు. మండల స్థాయిలో రెవెన్యూ సమస్యలపై సమగ్రమైన నోట్స్ తయారు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ భారతి నూతన చట్టం ప్రకారం మాత్రమే రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, సక్సేషన్లు, సాదా బైనామ చేయాలని తెలిపారు. భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై రెవెన్యూ అధికారులు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలన్నారు.

భూ భారతి చట్టాన్ని జిల్లాలోని మండలాన్ని ఒక పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ప్రణాళిక సిద్ధం చేయాలని సంబందిత తహసీల్దార్లను ఆదేశిం చారు. భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పన కు జిల్లా లోని తెలంగాణ సంస్కృతిక సారథి కళాకారులచే విస్తృతంగా ప్రచారం చేయించాలని జిల్లా పౌర సంబంధాల అధికారిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీవోలు వరంగల్ సత్యపాల్ రెడ్డి, నర్సంపేట ఉమారాణి, తాసిల్దారులు కలెక్టరేట్ సూపర్డెంట్లు పాల్గొన్నారు.

# చుక్కేస్తాం.. పక్కేస్తాం..!





- బీరు సీసాలు, మ్యాట్‌లు, జూదం కార్డులతో హౌసెస్ ఫుల్..!
- సొంతింటి కల 'కల'గానే మిగులుతుందా? అని ఆవేదనలో లబ్ధిదారులు
- కాంగ్రెస్ హయాంలోనైనా ఇండ్లు అందుతాయోమోనని ఆశగా ఎదురుచూపులు
- నిర్మించిన 'డబుల్' ఇండ్లను పంపిణీ చేయాలని తూర్పు జర్నలిస్టుల నిరాహార దీక్ష

## అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్‌గా 'డబుల్' ఇండ్లు!

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**





పేదల సొంతింటి కల నెరవేరుస్తామంటూ గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకం ఆశావాహులకు కన్నీళ్లు తెప్పిస్తోంది. సుమారు మూడేండ్ల క్రితం దేశాయిపేట లక్ష్మీ టౌన్షిప్‌లో నిర్మించిన 'డబుల్' బెడ్రూం హౌసెస్ నిరుపయో గంగా మారినా పట్టించుకునే నాథుడే లేడు. సదరు ఇండ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. జనంతో కళకళలాడాల్సిన ఆ ప్రాంగణంలోకి ఎంటరయితే చాలు.. ఏ రూమ్‌లోకి వెళ్లి చూసినా జూదం కార్డులు, బీరు సీసాలు, సాపలు(మ్యాట్‌లు) దర్శనమిస్తున్నాయి. అసాం ఘిక శక్తులకు ఆలవాలంగా మారిన ఆ ప్రదేశాన్ని చూస్తే.. ప్రజాధనంతో నిర్మించిన ఇండ్లు వృథాగా ఉండటానికి బాధ్యులెవరు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### 'డబుల్' ఇండ్లలోని సామగ్రి చోరీ..!

వరంగల్ తూర్పు జర్నలిస్టుల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలోనే ఇలా అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నట్టు స్పష్టంగా ఆనవాళ్లు కనిపిస్తుండడం ఓ రకంగా బాధాకరమే అని చెప్పొచ్చు. ఆసాంఘిక శక్తులు ఓవైపు కిటికీలకు డోర్లు, వాటర్ ట్యాంకులను.. డోర్లను.. స్విచ్ బోర్డులను పగులగొట్టేశారు. బాత్రూములను కంపు పట్టించేశారు.. ఇలా చెప్పుకుంటూ పోతే మనుషుల కోసం నిర్మించిన ఇండ్లను.. కుక్కలు, పందులు ఉండే నివాసా లుగా మార్చేశారు. 'డబుల్' ఇండ్ల కోసం వరంగల్ తూర్పు వర్కింగ్ జర్నలిస్టులు ముందడుగు వేసి సోమవారం నుంచి నిరాహార దీక్షలు చేపట్టడం మొదలుపెట్టారు. కచ్చితంగా తమకోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను తమకు పంపిణీ చేయాలని కంకణం కట్టుకొని నిరసన తెలుపుతున్నారు. నిరసన కార్యక్రమం మంగళవారంతో రెండో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా పలువురు రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, మేధావులు పాత్రికేయులకు సంఘీభావం తెలుపుతున్నారు. జర్నలిస్టులకు కచ్చితంగా 'డబుల్' ఇండ్లు ఇవ్వాలని వారు సైతం డిమాండ్ చేస్తున్నారు. రూ.కోట్లాది





ప్రజాధనంతో నిర్మించిన హౌసెస్ నిరుపయోగంగా ఉండటానికి ప్రభుత్వం, అధికారులు చూపుతున్న అలసత్వమే కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను జర్నలిస్టులకు, నిరుపేదలకు పంపిణీ చేస్తారో లేదో.. చూడాలి మరి..



ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు

## రూ.20.19 కోట్లు విడుదల


**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు రూ.20.19 కోట్లలను నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమచేయడం జరుగుతుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొదటి విడతలో పైలట్ ప్రాజెక్ట్ కింద మంజూరు చేసిన 70,122 ఇండ్లలో బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న 2019 మందికి లక్ష రూపాయిల చొప్పున రూ. 20.19 కోట్ల రూపాయిలను విడుదల చేశామని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నాకూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆటంకం ఏర్పడకుండా నిధులు విడుదల చేస్తామన్నారు. ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, గ్రౌండింగ్ అయిన ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నామని ఇప్పటికి 13,500 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 12 మంది లబ్ధిదారులకు మంగళవారం నాడు లాంఛనంగా లక్ష రూపాయిల చొప్పున చెక్కులను అందజేశారని తెలిపారు. మధ్య వర్తుల ప్రమేయానికి తావులేకుండా నాలుగు విడతల్లో లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాలోనే జమచేస్తామని

మిగతా 4వ పేజీలో..

# మంత్రివర్గ విస్తరణ ఆలస్యం!

**వేద న్యూస్, వి.వెంకటేష్ :**



- ఆశావాహుల్లో టెన్షన్
- జానారెడ్డి లేఖతో మరింత ఉత్కంఠ
- మంత్రివర్గంలో చోటు దక్కించుకునేందుకు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రయత్నం

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ నిరవధికంగా వాయిదా పడటంతో ఆశావహులు టెన్షన్ వాతావరణం నెలకొంది. కొందరు లోలోనా మరి కొందరు బహిరంగంగా మాటల యుద్ధం పేల్చుకుంటున్నారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఆలస్యం అవుతూ ఉండడంతో ఆశావహులకు టెన్షన్ వాతావరణం నెలకొంది. మంత్రివర్గ విస్తరణ అధిష్టానమే తుది నిర్ణయం అని గుసగుసలు వినిపిస్తున్నాయి. కొంతమంది ఆశావాహులు అయితే తమ అసంతృప్తిని బహిరంగ వేదికల పైనే నువ్వా... నేనా అన్నట్లుగా మాట్లాడుకుంటున్నారు. స్థానిక మంత్రిమండలి, నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ కాంగ్రెస్ పార్టీలో లేకపోవడంతో ఈ పార్టీలో ప్రతిబంధకంగా మారింది. తమకు మంత్రి పదవులు దక్కకుండా చేస్తున్నారు. అంటూ ఏకంగా అధిష్టానాన్ని లక్ష్యంగా చేసుకొని బహిరంగ విమర్శలకు దిగుతున్న సంఘటనలు లేకపోలేదు. సమిష్టి నిర్ణయంతో మంత్రిమండలి చేస్తామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇటీవల చేసిన ప్రకటన ఆశావహులకు మింగుడు పడటం లేదు. ప్రస్తుత మంత్రిమండలిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు 11 మంది మంత్రులు కొలువుదీరిన సంగతి విధితమే. అయితే గత లోకసభ ఎన్నికల నుండి మంత్రివర్గ విస్తరణ పై ఊహాగానాలు మొదలయ్యాయి. కానీ మంత్రివర్గ విస్తరణ మాత్రం జరగలేదు. అందుకు కారణం లేకపోలేదు. ముంచుకొచ్చిన ఆషాడం, హర్యానాలో ఓటమి, రాహుల్ గాంధీ విదేశీ పర్యటన, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన, అంటూ మంత్రివర్గ విస్తరణను దాటవేస్తూ వచ్చారు. గత మాసంలో 16,17 వ తేదీలలో మంత్రివర్గ విస్తరణ పై తెలంగాణ నాయకులతో అధిష్టానం సమావేశమైన అధిష్టానానికి స్థానిక నాయకులకు ఏకాభిప్రాయం కుదరకపోవడంతో వాయిదా పడింది.తెలుగు సంవత్సరాది ఉగాది రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ను కలిసినప్పుడు, మంత్రివర్గ విస్తరణ కోసమే కలిశారు అని పుకార్లు చెక్కర్లు కొట్టాయి. ఎవరికి మంత్రి పదవులు వస్తాయి, ఆశావహులు తలమునకలు అయ్యారు. ఇది ఇలా కొనసాగుతుండగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వివాదం తెర ముందుకు రావడంతో ఏప్రిల్ మొదటి వారంలో కొనసాగిన మంత్రివర్గ విస్తరణ తెరచాటుకు పోయింది. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యాశాఖ హోంశాఖ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ వంటి కీలక శాఖలు నేనే పర్యవేక్షిస్తానని ఇటీవల నొక్కి చెప్పుతూ ఉండడంతో మంత్రివర్గ విస్తరణ అవకాశాలు తక్కువే అని ఊహాగానాలు వినిపించాయి. దీనికి తోడు కాంగ్రెస్ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి అధిష్టానానికి లేఖ రాయడం కలకలం రేపింది. ఆయన లేఖ రాయడానికి కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవులు ఆశిస్తున్న కొందరు బహిరంగ అసంతృప్తికి గురి అవుతున్నారు. పార్టీలో మంత్రి పదవులు ఆశించే వారి సంఖ్య పెరుగుతూ ఉండడంతో ఆరు వ్యక్తులలో సామాజిక

మిగతా 4వ పేజీలో..

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు : 4లో..

## వడదెబ్బతో మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం ఆసరా

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి:**

తీవ్రమైన ఎండలు, వడగాలులు, వడదెబ్బ వంటి కారణాలతో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల కుటుంబాలకు ఆదుకోవడానికి రూ.4 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించడానికి వీలుగా తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వడదెబ్బ కారణంగా ఎవరైనా మరణిస్తే గతంలో రూ. 50 వేలు చెల్లించడానికి వీలుండేది. రాష్ట్ర విపత్తు సహాయ నిధి కింద ప్రస్తుతం ఆ ఎక్స్ గ్రేషియాను రూ.50 వేల నుంచి రూ.4 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం (జీవో ఎంఎస్ నంబర్5) మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇలావుండగా, వడగాలుల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పౌరులందరూ అప్రమత్తంగా ఉండాలని, స్థానిక అధికారులు జారీ చేసిన ఆరోగ్య సలహాలను పాటించాలని ప్రభుత్వం కోరింది. వడగాలులు వాటి ప్రభావాలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ప్రభుత్వం సంబంధిత శాఖల ద్వారా కార్యక్రమాలను చేపట్టింది.

## 'ఆత్మ'పై కేసు!

- 9 ఏండ్ల క్రితం మృతిచెందిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్
- ఆత్మ వచ్చి ఓ స్థలం హద్దురాళ్లు ధ్వంసం చేసి వెళ్లిందా?
- మిల్స్ కాలనీ పోలీసుల పని తీరుపై ప్రశ్నలు

4లో..

# జర్నలిస్టులకు తక్షణమే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి

**- పిడిఎస్ యూ జిల్లా కార్యదర్శి రాచకొండ రంజిత్ కుమార్**

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధన కోసం దేశాయిపేటలో నిర్మించిన ఇండ్ల వద్ద జర్నలిస్టులు చేపట్టుతున్న నిరాహార దీక్ష శిబిరాన్ని పిడిఎస్ యు జిల్లా కమిటీ సందర్శించి వారికి పూర్తి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్ కుమార్ మాట్లాడుతూ దేశాయిపేట టౌన్షిప్ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ గృహాలను తూర్పు నియోజకవర్గం జర్నలిస్టులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు అనేక ఇబ్బందులతో వారి జీవితాలను గడుపుతున్నారని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు వారి మేనిఫెస్టోలో అనేక హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే జర్నలిస్టులకు హెల్త్ కార్డులు డబుల్ బెడ్ రూమ్ ఇల్లులు ఉచిత బస్సు పాసులు కల్పిస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టుల పైన బెదిరింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. అసెంబ్లీ సాక్షిగా రేవంత్ రెడ్డి జర్నలిస్టులపై కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడ్డాడని, ఇప్పుడు గత ప్రభుత్వం వారి కేటాయించిన గృహాలను ఇప్పుడు వారికి ఇవ్వకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని తక్షణమే జర్నలిస్ట్ సంఘ నాయకుల తోటి చర్చలు జరిపి అర్హులైన జర్నలిస్టులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లులను కేటాయించాలని వారు కోరారు.



ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వంశీ, జిల్లా కమిటీ సభ్యులు ముషారఫ్, జిల్లా నాయకులు ఠాగూర్ సాయి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జర్నలిస్టులకు ఇండ్లు కేటాయించాలి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సాధన కొరకు గత కొద్దిరోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్న వరంగల్ తూర్పు జర్నలిస్టులకు బీఆరెస్ రాష్ట్ర నాయకురాలు డా.హరి రమాదేవి సంఘీభావం తెలిపారు. దేశాయిపేట లక్ష్మీమెగా టౌన్ షిప్ ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద నిర్వహిస్తున్న వారి దీక్షలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. తమ బీఆరెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇండ్లను జర్నలిస్టు కుటుంబాలకు కేటాయించడానికి



ప్రయత్నాలు చేసినప్పటికీ సమయాభావం వల్ల పూర్తి చేయలేకపోయామన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జర్నలిస్టులకు ఆ ఇండ్లను అలాట్ చేసి ఆర్థికంగా కడు దయనీయ స్థితిలో ఉన్న వారికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేసారు. అసాంఘిక శక్తులకు ఆలవాలంగా మారి శిథిలమైతున్న ఇండ్లు తక్షణం మరమ్మతులు చేసి జర్నలిస్టు కుటుంబాలకు అందించడానికి స్థానిక ఎమ్మెల్యే,మంత్రి కొండా సురేఖ చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట వీకేర్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు హరి రమేష్ బాబు, అడ్వకేట్ డా.ఎడ్ల ప్రభాకర్, జక్కుల రాజ్ కుమార్, రాజగిరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ జర్నలిస్టులకు అన్యాయం చేసింది

- కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులను పట్టించుకోకపోవడం బాధాకరం
- జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వెంటనే ఇవ్వాలి
- ఎర్రబెల్లి ప్రదీప్ రావు

వేద న్యూస్, వరంగల్ టౌన్ :

వరంగల్ తూర్పు నియోజకవర్గం జర్నలిస్టులకు తక్షణమే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు డిమాండ్ చేశారు .మంగళవారం వరంగల్ తూర్పు నియోజకవర్గం వర్కింగ్ జర్నలిస్టుల నిరాహార దీక్ష రెండో రోజు బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఎల్లప్పుడూ జర్నలిస్టులను కంటికి రెప్పల కాపాడుకోవడమే కాకుండా జర్నలిస్టుల కోసం ఎక్కడి వరకు అయినా వెళ్లి కొట్లాడడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు.

పార్టీలు మారిన, పాలకులు మారిన, మారని జర్నలిస్టుల పరిస్థితి అని మండి పడ్డారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన యొక్క నిధులు, కేంద్ర నిధులతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కట్టించి తాము కట్టించామని గొప్పగా చెప్పుకుంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులను ఈ రకంగా నిర్లక్ష్యం చేయడం సరికాదని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వకముందే ఇచ్చానని గోడలపై రాయించుకున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్ కు సరైన బుద్ధి చెప్పారని అన్నారు.

ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే మంత్రి హోదాలో ఉండి జర్నలిస్టులను చిన్నచూపు చూస్తూ వారికి కేటాయించకపోగా వారు చేస్తున్న నిరాహార దీక్షపై ఎటువంటి స్పందన లేకపోవడం వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలు



తలదించుకునే విషయమని తెలిపారు. ఏది ఏమైనా జర్నలిస్టుల కోసం రాష్ట్ర స్థాయిలో పోరాటం చేస్తానని ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాబేటి వెంకట్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నే రవీందర్,మండల అధ్యక్షులు విప్ప సుధాకర్ డివిజన్ అధ్యక్షులు తోట సురేష్, సమ్మెట శ్రీనాథ్, బిజెపి నాయకులు కొంతం సంగీత్, బల్మూరి రాజు, ముంద్రాతి వెంకటేశ్వర్లు, గుండా ప్రభాకర్ గుప్తా, వినోద్, మల్లికార్జున్ తదితర బిజెపి నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం

**వేద న్యూస్, హన్మకొండ :**

హన్మకొండ రాంనగర్ లోని కొండా దంపతుల నివాసంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ప్రజల నుంచి విజ్ఞప్తులను వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ప్రజల సమస్యలను తీర్చడానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసనిచ్చారు. ప్రజల సమస్యలను సావధానంగా వింటూ సంబంధిత శాఖల అధికారులతో అప్పటికప్పుడే ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ప్రజలు అవసరార్థలు పలుమార్లు అధికారులు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వీలైనంత త్వరగా పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని కొండా మురళీధర్ రావు అధికారులను ఆదేశించారు. ఈ



**- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి**

సందర్భంగా కొండా మురళీధర్ రావుమాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా కొండా దంపతులు అందుబాటులో ఉంటారని ఏ సమస్యలున్నా ప్రజలు ఎలాంటి పైరవీలు చేయకుండా నిరభ్యంతరంగా తనను సంప్రదించవచ్చునని అన్నారు. కార్యకర్తలకు, నాయకులకు ఏ ఆపద వచ్చిన కొండా దంపతులు కంటికి రెప్పలా కాపాడుకుంటామని స్పష్టం చేశారు.

# పిల్లల ఎదుగుదలకు పోషక ఆహారం ఎంతో అవసరం



**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణ పరిధిలోనీ 28వ వార్డు అంగనావాడి సెంటర్, నందిపహడ్- 2 పరిధిలో,పోషణ పక్షం కార్యక్రమాన్ని మంగళవారం ఐసిడిఎస్ మిర్యాలగుడ అర్బన్ ప్రాజెక్టు షెడ్యూల్ ప్రకారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సూపర్ వైజర్ పద్మ మహిళలకు, గర్భిణీలకు,బాలింతలకు,పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. ఒక మనిషి సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవనానికి, శరీరక,మానసిక ఎదుగుదలకు అవసరమైనవి వివరించారు. బరువు వయస్సుకు తగ్గ ఎత్తు, ఎతుకు తగ్గ బరువు గురించి వివరించడం జరిగింది.0-5 సంవత్సరాల సమయంలో వారి మెదడు,శారీరకంగా, పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పద్మ,టీఎంసీ ఒక్కయ్యు,సి ఓ వెక్రటేశ్వర్లు,12పీ.సరిత,ఏఎన్ఎం సంధ్య, ఆశకార్యకర్త నాగమణి,అంగన్వాడి టీచర్ శేషు మణి,ఆయా కరుణ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా జ్ఞానోదయ వీడ్కోలు




**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**

జ్ఞానోదయ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆధ్వర్యంలో మెట్ పల్లి పట్టణంలో మంగళవారం మనోహర్ గార్డెన్ లో డిగ్రీ ఫైనల్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా డాక్టర్ హెప్సిబా కిరణ్, డాక్టర్ జాకబ్ కిరణ్, కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్ లు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని, తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలని, చదువు చెప్పిన అధ్యాపకులు మీ ఎదుగుదల చూసి గర్వపడాలని అన్నారు. ఇంతకుముందు జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో చదివిన విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్నారని, ప్రభుత్వ ఉద్యోగులగా కూడా ఉన్నారని, అలాగే మీరు కూడా ఉన్నత స్థానంలో ఉండి కళాశాలకి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.వి. సంతోష్, వైస్ ప్రిన్సిపాల్ రాజు,అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# గాయపడిన రైతును పరామర్శించిన ఎమ్మెల్యే



**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ నియోజకవర్గంలో రైస్ మిల్లు ఓనర్ దాడిలో గాయ పడిన రైతును ఎమ్మెల్యే బీఎల్ఆర్ పరామర్శించారు. వివరాల్లోకి వెళ్తే రెండు రోజుల క్రితం మిర్యాలగూడ మండలం అవంతిపురం పరిధిలోని సూర్య తేజ రైస్ మిల్ నందు ధాన్యం పోయడానికి వచ్చిన రైతుని రైస్ మిల్లు ఓనర్ దాడి చేసి గాయపరచడం జరిగింది. జరిగిన గొడవలో గాయపడిన బాధలపురం గ్రామానికి చెందిన రైతు శివనేని నాగరాజు బాలాజీ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి వారిని పరామర్శించి రైతు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.వారికి మెరుగైన వైద్య సేవలను అందించాలని హాస్పిటల్ సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రాజకీయ ఎదుగుదల ఓర్వలేకే అసత్య ఆరోపణలు..!

**- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆడుప మహేష్**

**వేద న్యూస్,కాశీబుగ్గ :**



తన రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేక తనపై అసత్య ఆరోపణలు చేసిన ఓ మహిళపై పరువు నష్టం దావా వేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అడప మహేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ లో మహేష్ మాట్లాడుతూ సాయి వీధి కాలనీకి చెందిన నాగలక్ష్మి అనే మహిళ నెల రోజుల క్రితం తనపై ఇందిరమ్మ ఇండ్ల కోసం డబ్బులు వసూలు చేశాడని అసత్య ఆరోపణలు చేయడంతో అట్టి వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తాను తన కుటుంబం మానసిక ఆవేదనకు గురయ్యామని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో 2013 సంవత్సరంలో నాటి వర్ధన్నపేట ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ హాయంలో ఎనుమాముల శివారులో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు లేని పేదలను గుర్తించి వారి వివరాలను రెవిన్యూ, జిల్లా కలెక్టర్ సమర్పించగా అధికారులు ఎంక్వయిరీ చేసి లబ్ధిదారులను ఎంపీగా చేయడం జరిగిందన్నారు. అందులో 485 ఇండ్లను మంజూరు చేసి ఎఫ్ ఆర్ సి నెంబర్ కూడా ఉందన్నారు. లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చే రోజున లబ్ధిదారుల మధ్య గొడవ జరగగా అధికారులు మరుసటి రోజుకు వాయిదా వేయడం జరిగిందన్నారు. కానీ తెల్లవారుజామున ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అట్టి ఇందిరమ్మ ఇండ్లు ఆగిపోయాయని అన్నారు. వివరాలు ఈ విధంగా ఉంటే నాగలక్ష్మి అనే మహిళ తనపై అసత్య ఆరోపణలు చేసి తన ప్రతిష్టకు భంగం కలిగించినందువల్ల ఆమెపై పరువు నష్టం దావా వేస్తున్నట్లు మహేష్ తెలిపారు.

# తెలంగాణకు తలమానికం ధర్మపురి నాటక సంస్థ

తెలంగాణలోనే మొదటిదిగా, తెలంగాణకే తలమానికంగా, ధర్మపురి పుణ్య క్షేత్రంలోని శ్రీ లక్ష్మనరసింహ నాట్య మండలి దాదాపు తొంభై సంవత్సరాలకు పైగా, కళామత ల్లికి ఎనలేని సేవలందిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. సనాతన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు నిలయమైన ఈ క్షేత్రంలో, 1936లో ప్రారంభమైన నాటక సంస్థ 3 తరాల నటులతో పలు పౌరాణిక సాంఘిక చారిత్రక నాటకాలు - నాటికలు ప్రదర్శిస్తూ రాష్ట్రంలోని పలు ప్రాంతాలు ప్రజాభిమానాన్ని చూరగొన్నది. గోదావరి తీరస్థ ప్రాచీన తీర్థము, పుణ్య క్షేత్రము అయిన ధర్మపురి పట్టణం, వేల సంవత్సరాల నుండి ఉజ్వల సాంస్కృతిక, వైదిక, నాగరికత, కలిగివున్న క్షేత్రంగా... ఆర్ష విద్యతో పాటు, సంగీతాది లలిత కళలకు నిలయంగా వాసికెక్కింది. తెలంగాణ ప్రాంతంలో సాంస్కృతిక చైతన్యం అంతగా లేక, స్తబ్దంగా ఉన్న రోజుల్లో, స్థానికుల సహకారంతో స్థాపించబడిన నాటక సంస్థ, తెలంగాణ లోనే మొదటిదిగా నిలువ కలిగింది. ఇది ప్రారంభం అయ్యే నాటికి తెలుగు భాషకు విలువలేని "ఉర్దూ రాజభాష"గా గల నిజాం రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు... భారతీయ సంస్కృతికి వైద్యులకు కళలకు విలువ ఇవ్వని కేంద్ర ఆంగ్ల ప్రభుత్వం మరోవైపు, అననుకూల వాతావరణం ఉండేది. అయినా స్థానికుల అభిమానం, ధనం, సేవాభావం, ఈ సంస్థకు ఊపిరి పోసాయి. కీర్తిశేషులు కాసర్ల వెంకట రాజయ్య శిక్షణలో, దర్శకత్వంలో, తొలి తరం నటులు "సతీ సావిత్రి" నాటక ప్రదర్శనతో ప్రారంభించి, అనంతర కాలంలో వెను తిరిగి చూడకుండా, సుమారు పాతిక పౌరాణిక నాటకాలు... ద్రౌపతి వస్త్రాపహరణం, భక్త ప్రహ్లాద, శ్రీకృష్ణ తులాభారం, లవకుశ, భక్త రామదాసు, సతీ సక్కుబాయి, సతీ తులసి, శ్రీకృష్ణ రాయబారం, పాండవోద్యోగం వంటి అనేక నాటకాలు ప్రదర్శించారు. ఆరోజుల్లో ఈ నటులు ప్రదర్శించని పౌరాణిక నాటకమే లేదంటే అతిశయోక్తి లేదేమో. కాకెరి లక్ష్మీ కాంత శాస్త్రి, రొట్టె చంద్రశేఖరశాస్త్రి, సంగనభట్ల మాణిక్య శాస్త్రి, తెలంగాణ త్యాగయ్య చాచం కృష్ణయ్య, జగన్నగారి విశ్వనాథశాస్త్రి లాంటి ఉద్దండులు, వారి సరసన దెమ్మ బాలకృష్ణయ్య స్త్రీ పాత్ర ధారిగా తొలి తరం నటులు బహు ప్రశంసా పాత్రులు అయినారు. నాటక సంస్థ రథసారథులలో ఒకరైన కే. వీ. కేశవులు ( రాష్ట్ర మాజీ మంత్రి), 1946లో మంచిర్యాలలో ఆంధ్ర సారస్వత పరిషత్తు మహా సభలలో, శ్రీకృష్ణ తులాభారం నాటకాన్ని ప్రదర్శింప చేయగా, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, నార్ల వెంకటేశ్వరరావు వంటి ప్రముఖులు నాటకాన్ని కాంచి, బహుధా ప్రశంసించారు. తర్వాత కాలంలో దేవులపల్లి రామానుజరావు, కాళోజీ నారాయణరావు, పివి నరసింహారావు, స్థానం నరసింహారావు లాంటి మేధావుల ప్రశంసా పాత్రమైంది. స్థానిక దైవం లక్ష్మీ నరసింహ బ్రహ్మోత్సవాలలో, ప్రత్యేక ఓపెన్ థియేటర్ లో ప్రదర్శిత నాటకాలకు జనం టిక్కెట్టు కొని మరీ చూసేవారు. ఆ రోజుల్లోనే సొంత నాటక ప్రదర్శన శాల ఉండేది. రకరకాల సీనరీ పరదాలు, మేకప్ సామగ్రి, గదలు, కిరీటాలు, ఉయ్యాలలు, నిచ్చెనలు, ఫైర్ వర్క్స్, వగయిరా సకల హంగులతో అట్టహాసంగా ఉండేది. మొదటి తెరపై భారతమాత చిత్రపటం కలిగి ఉన్న ఈ సంస్థ ఆ రోజుల్లో పెద్ద సాహసమే చేసింది. ఎందుకంటే ఇది రాజ ద్రోహం కిందకు వచ్చేది. ఫైర్ వర్క్స్ లో యముని రాక, నారదుని మబ్బుల్లో ప్రయాణం, శిశుపాలుని శిరచ్ఛేదం, ప్రహ్లాదుని అగ్నిగుండంలో వేయడం, ద్రౌపదికి కృష్ణుడు చీరలు అందించడం, వంటి ఎన్నో అద్భుతాలను కశో జ్జల శివరామయ్య పర్యవేక్షణలో చూపారు. రెండవ తరం నటులు దశాబ్దకాలం ప్రదర్శన ఇవ్వగా, నాటి సీనియర్ నాయకులుదాదగారి కిషన్ రావు నిర్వహణలో, సంస్కృతాంధ్ర డిగ్రీ కళాశాలకు ప్రారంభ నిధుల సేకరణ గావించారు. గయోపాఖ్యానం నాటకం తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో రొట్టె విశ్వనాథశాస్త్రి, గుండయ్య శాస్త్రి, పెండ్యాల శంకర్, ఓజ్జల రామచంద్రం, నరసింహా చారి, గుండి హనుమాన్లు, భోగం పురుషోత్తం వంటి మేటి నటులతో ప్రదర్శించారు. మూడవ తరంలో పౌరాణిక నాటకాలతో పాటు వీరపాండ్య కట్ట బొమ్మన, వీర కాపయ, నాగమ నాయకుడు లాంటి చారిత్రక నాటకాలు పెక్కు సాంఘిక నాటకాలు ప్రదర్శనలను కొనసాగిస్తున్నారు. 1984లో జిల్లా కలెక్టర్ కె ఎస్ శర్మ, 1991 లో కలెక్టర్ బన్వర్ లాల్ ఆహ్వానం మేరకు, వారి సమక్షంలో కరీంనగర్ కళాభారతిలో ప్రదర్శనలిచ్చి బహుమతులు అందుకున్నారు. 1989 లో తెలుగు విశ్వ విద్యాలయం నిర్వహించిన, సాంప్రదాయ పద్య నాటక పోటీలలో సూర్యాపేటలో "కట్టబొమ్మన" ప్రదర్శించారు. 2016లో వరంగల్ లో, వేణుమాధవ్ ఆడిటోరియంలో... అనంతరం హైదరాబాదులోని రవీంద్ర భారతిలో.. ప్రదర్శన ఇవ్వడం జరిగింది. నిధులు ప్రోగు చేసి సొంత సామగ్రిని సమకూర్చు కున్నారు. ప్రస్తుత నటులలో కొందరు వీడియో, చలన చిత్రాలలో అవకాశాలు పొందారు. విద్యావేత్త విశ్రాంత ప్రాచార్యులు డాక్టర్ సంగనభట్ల నరసయ్య, బహుముఖ ప్రజ్ఞాశాలి, నటులు కొరిడె నరహరిశర్మ, కాకెర్ల దత్తాత్రేయ, ఎస్ రామకృష్ణయ్య, మునిగాల కిషన్ తదితరులు చారిత్రక నటులుగా మిగుల గుర్తింపు పొందారు 1993 లో తెలుగు యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ పేర్వారం జగన్నాథం ద్వారా నిధులు పొంది, స్వర్ణోత్సవాలు జరిపి, గయోపాఖ్యానం నాటకం ప్రదర్శించి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ దర్శకులు దివంగత బి.ఎస్. నారాయణ చేత కళాకారులకు సన్మానాలు చేయించారు. సావనీర్ విడుదల చేశారు. 1955లో ఈ సంస్థ కళాకారులకు ఆంధ్ర నాటక పరిషత్తు 1983లో ఆంధ్ర ప్రదేశ్ నాటక అకాడమీ కాకర లక్ష్మీకాంత శాస్త్రికి, పెండ్యాల సీతారాములకు ఘనంగా సత్కారం చేశాయి. స్థానిక డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సయ్య నాటక రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా గ్రామీణ కళా జ్యోతి అవార్డు లభించింది. నలుగురు వృద్ధ కళాకారులకు గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్ పథకాలను మంజూరు చేసింది. ఎనిమిదిన్నర దశాబ్దాలకు పైగా కళామతల్లికి సేవ చేస్తూ సాంప్రదాయక పద్య నాటకాలను బ్రతికిస్తున్న అపురూప అరుదైన నాట్యమండలి 2017 ఏప్రిల్ 2,3 తేదీలలో నాటి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే.వీ. రమణాచారి, నాటి ప్రభుత్వ చీఫ్ విప్, గత రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ బీసీ కమిషన్ చైర్మన్ బీ. ఎస్.రాములు తదితర ప్రముఖులు హాజరు కాగా, 80 వసంతాల వేడుకలు ఘనంగా నిర్వహించు కున్నారు. ప్రస్తుతం నరహరి శర్మ ఆధ్వర్యంలో, నర్సయ్య పర్యవేక్షణలో, దత్తాత్రి నిర్వహణలో, రామకిష్టయ్య, చంద్రమౌళి, వెంకట రమణ, కిశోర్, మహేందర్, సురేశ్, బాలకృష్ణ, శేఖర్, నర్సింహమూర్తి, జన్మంచి నరసయ్య, వంశీ కృష్ణ, నరహరి, అమర్, అనిల్, శ్రీనివాస్, రాంకిషన్, సంజీవ్, రాజ గోపాల్ లకు తోడు కాకెరి అరుణ, సంగనభట్ల ప్రతిభ తదితరులు స్త్రీ పాత్రలను పోషిస్తూ, పౌరాణిక చారిత్రక నాటకాల ప్రదర్శనలను కొన సాగిస్తున్నారు.

# సూడాన్‌లో డార్ఫర్ దాడులు



**వేద న్యూస్,**


ఆఫ్రికా దేశంలోని సూడాన్‌లో పారామిలిటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ బలగాలు ఇటీవల దాడులకు తెగబడిన విషయం విదితమే. ఈ దాడుల్లో దాదాపు 300 మందికి పైగా మఅతి చెందినట్లు ఐక్యరాజ్యసమితి మానవతా ఏజెన్సీ ఈ విషయాన్ని వెల్లడించింది. జామ్జామ్, అబూషాక్ శిబిరాలపై గతవారం ఆర్ఎస్ఎఫ్ బలగాలు దాడులకు పాల్పడ్డాయి. ఇందులో 300 మందికి పైగా పౌరులు చనిపోయారని ప్రాథమిక గణాంకాలు వెల్లడిస్తున్నాయని ఆఫీస్ ఫర్ ది కోఆర్డినేషన్ ఆఫ్ హ్యూమానిటేరియన్ అఫైర్స్ పేర్కొంది. మఅతుల్లో 10 మంది రిలీఫ్ ఇంటర్నేషనల్‌కు చెందిన మానవతా సిబ్బంది కూడా ఉన్నట్లు వెల్లడించింది. వారు జామ్జామ్ శిబిరంలోని ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తుండగా ప్రాణాలు విడిచినట్లు తెలిపింది. మరణించినవారిలో 23 మంది చిన్నారులు ఉన్నట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇక, యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ ఈ దాడులను తీవ్రంగా ఖండించారు. శత్రుత్వాన్ని వెంటనే ముంగిచాలని, పౌరులకు, మానవతా సిబ్బందికి రక్షణ కల్పించాలని పిలుపునిచ్చారు. కాగా.. 16 వేల మంది పౌరులు జామ్జామ్ శిబిరాన్ని వీడినట్లు తెలుస్తోంది. 2023 ఏప్రిల్‌లో సూడాన్ ఆర్మీ చీఫ్ అబ్దుల్ ఫత్తా అల్-బుర్హాన్ మాజీ డిప్యూటీ, ఆర్ఎస్ఎఫ్ కమాండర్ మొహమ్మద్ హమ్దాన్ డాగ్లోల మధ్య ఘర్షణ నెలకొనడంతో ఇరువర్గాల మధ్య దాడులు ప్రారంభమయ్యాయి. సుడానీస్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్, ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ ల మధ్య జరిగిన దాడుల వల్ల 2023 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 29,600 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. కోటి మందికి పైగా సూడాన్‌ను వదిలివెళ్లినట్లు ఐక్యరాజ్య సమితి గణాంకాలు చెబుతున్నాయి.

# మెహుల్ చోక్సీ అరెస్ట్..



**వేద న్యూస్,** పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీని బెల్జియంలో అరెస్టు అయ్యారు. ఈ విషయాన్ని అధికార వర్గాలు ధృవీకరించాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ రుణ మోసం కేసులో పరారీలో ఉన్న 65 ఏళ్ల వ్యక్తిని భారత సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అభ్యర్థన మేరకు శనివారం(ఏప్రిల్ 12) బెల్జియం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతను ప్రస్తుతం బెల్జియన్ జైలులో ఉన్నాడు. అధికార వర్గాల ప్రకారం.. చోక్సీ బెల్జియం పౌరసత్వం కలిగిన తన భార్య ప్రీతి చోక్సీతో కలిసి బెల్జియంలోని ఆంట్వెర్ప్‌లో నివసిస్తున్నాడు. క్యాన్సర్ చికిత్స నెపంతో ఆంటిగ్వా నుండి బెల్జియంకు ప్రయాణించాడని తెలుస్తోంది. స్విట్జర్లాండ్‌కు పారిపోవాలని ప్రయత్నిస్తున్న క్రమంలో బెల్జియం పోలీసులు చోక్సీని అదుపులోకి తీసుకున్నారు. కాగా, 13,500 కోట్ల రూపాయల కుంభకోణంలో చోక్సీ కీలక నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. తన మేనల్లుడు నీరవ్ మోడీతో కలిసి, ఈ మోసానికి కుట్ర పన్నాడని, మోసపూరిత అండర్‌టేకింగ్ లెటర్‌లను ఉపయోగించి ప్రభుత్వ యాజమాన్యంలోని బ్యాంకు నుండి భారీ మొత్తాలను స్వాహా చేశాడని ఆరోపణలు ఉన్నాయి. దీంతో అతను విదేశాలకు పారిపోయాడు. ఈ కుంభకోణంలో చోక్సీపై జది×, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లు కేసు నమోదు చేసి అతన్ని ఇండియాకు రప్పించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. భారత్ అభ్యర్థన మేరకు బెల్జియం పోలీసులు చోక్సీని అరెస్టు చేశారు.

# సముద్రంలో స్మగ్లర్లు పడేసిన రూ. 1800 కోట్ల డ్రగ్స్ స్వాధీనం



**వేద న్యూస్,** గుజరాత్ ఉగ్ర నిరోధక బృందం (ఎటిఎస్), కోస్ట్ గార్డ్ రూ. 1800 కోట్లు విలువ చేసే 300 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు, స్మగ్లర్లు అంతర్జాతీయ సరిహద్దు రేఖ మీదుగా పారిపోయే ముందు వాటిని అరేబియా సముద్రంలో పడేశారని అధికారులు సోమవారం వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ మెథామ్‌ఫెటమైన్‌గా అనుమానిస్తున్నట్లు, వాటిని మరింత దర్యాప్తు నిమిత్తం ఎటిఎస్‌కు అప్పగించినట్లు భారతీయ కోస్ట్ గార్డ్ (ఐసిజి) ఒక ప్రకటనలో తెలియజేసింది. ఎటిఎస్, కోస్ట్ గార్డ్ ఈ నెల 12 అర్ధరాత్రి గుజరాత్ వద్ద అరేబియా సముద్రంలో అంతర్జాతీయ సాగరప్రాంత సరిహద్దు రేఖ (ఐఎంబిఎల్) సమీపంలో సంయుక్త ఆపరేషన్ సాగించినట్లు ఆ ప్రకటన తెలిపింది. కోస్ట్ గార్డ్ నౌక తమ దిశగా వస్తుండడం గమనించిన ఒక పడవలోని స్మగ్లర్లు డ్రగ్స్‌ను సముద్రంలో పడేసి, ఐఎంబిఎల్ దాటి పారిపోయారని ప్రకటన తెలిపింది. '12 అర్ధరాత్రి ఒక ఆపరేషన్‌లో సముద్రంలో నిఘా ఆధారిత మాదకద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమాన్ని గుజరాత్ ఎటిఎస్‌తో కలసి చేపట్టింది. రూ. 1800 కోట్లు విలువ చేసే 300 కిలోలకు పైగా మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకోవడమైంది. స్వాధీనం చేసుకున్న ఆ సరకు మెథామ్‌ఫెటామైన్‌గా అనుమానిస్తున్నారు' అని ప్రకటన వివరించింది. గుజరాత్ ఎటిఎస్ నుంచి అందిన ఒక సమాచారం ఆధారంగా కోస్ట్ గార్డ్ రీజియన్ (పశ్చిమం) నుంచి ఒక ఐసిజి నౌకను ఐఎంబిఎల్ సమీపాన సముద్రంలో ఆ ప్రాంతానికి మళ్లించినట్లు, అక్కడ ఒక అనుమానిత పడవ ఉనికిని కనుగొన్నట్లు ప్రకటన తెలిపింది. 'ఐసిజి నౌక చిమ్మచీకట్లో కూడా ఒక అనుమానిత పడవను గుర్తించింది. ఆ నౌక తమ వైపు వస్తుండడం గమనించి అనుమానిత పడవ తన మాదకద్రవ్యాల సరకును సముద్రంలో పడేసి ఐఎంబిఎల్ దిశగా పరారైంది. అప్రమత్తమైన ఐసిజి నౌక అనుమానిత పడవను వెంటాడనారంభించి, ఆ సరకును వెంటనే స్వాధీనం చేసుకోవడానికి తన సముద్ర పడవను నియోగించింది.



# కీలక ఎగుమతులు నిలిపివేసిన చైనా

**వేద న్యూస్,** బీజింగ్ :

టారీఫ్‌ల యుద్ధంలో అమెరికాకు చైనా గట్టి షాక్ ఇచ్చింది. అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలను అమెరికాకు ఎగుమతి చేయడాన్ని చైనా నిలిపివేసింది. ఈ మేరకు న్యూయార్క్ టైమ్స్ సోమవారం ఒక కథనం ప్రచురించింది. చైనా తీసుకున్న ఈ నిర్ణయంతో అమెరికాతో పాటు, అనేక పశ్చిమదేశాల్లో ఆయు ధాలు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఏరోస్పేస్ ఇండిస్టీ, సెమీ కండక్టర్ల తయారీ కంపెనీలకు అనేక సమస్యలు ఎదురుకానున్నట్లు ఆ కథనంలో పేర్కొంది. రెండవసారి అధ్యక్షునిగా ఎన్నికైన తరు వాత ట్రంప్ ప్రారంభించిన ఈ టారీఫ్‌ల యుద్ధంపై అమెరికాలోనే తీవ్ర వ్యతిరేకత, నిరసనలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చైనా తీసుకున్న తాజా నిర్ణయం మరింత ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. ఎగుమతులకు సంబంధించి నూతన నిబంధనలను చైనా రూపొం దిస్తోంని, అప్పటి వరకు చైనా పోర్టుల నుండి వీటి ఎగుమతిని నిలిపివేసినట్లు చెబుతున్నారు. దాదాపు ప్రతీ వస్తువు తయారీలో కీలకమైన అయస్కాంతాల రవాణా స్థంభించడంతో తయారీ రంగంపై పెను ప్రభావం పడుతుందని సమాచారం.

# కాంగ్రెస్ మాజీ మంత్రి ఇంట్లో ఇడి సోదాలు



**వేద న్యూస్,** జైపూర్ :

రాజస్థాన్‌లోని అధికార బిజెపి ప్రభుత్వాన్ని విమర్శించినందుకు కాంగ్రెస్ నేత ఇంట్లో ఇడి దాడులు ప్రారంభించింది. మంగళవారం జైపూర్‌లోని సివిల్ లైన్స్ ప్రాంతంలోని రాజస్థాన్ మాజీ మంత్రి ప్రతాప్‌సింగ్ ఖచారియావాస్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు సోదాలు నిర్వహించారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్‌గెహ్లాట్ సిఎంగా ఉన్న హయాంలో ప్రతాప్ రవాణా శాఖకు మంత్రిగా వ్యవహరించారు. ఇడి దాడులపై ప్రతాప్ మాట్లాడుతూ.. 'నాకు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా ఇడి అధికారులు నా నివాసంలో సోదాలు నిర్వహిస్తున్నారు. నా వద్ద దాచడానికి ఏమీ లేదు. ఇడి అధికారులకు నేను పూర్తిగా సహకరిస్తాను. ఇడి తన పని తాను చేసుకుంటోంది. నేనెవరికి భయపడను. బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వారి ఇంటికి ఇడి అధికారులు వస్తారు' అని ఆయన అన్నారు.కాగా, కాంగ్రెస్ నేత ఇంటిపై దాడులు నిర్వహించడంతో.. ఆయన నివాసం వద్ద ఉద్రిక్తవాతావరణం నెలకొంది. ప్రతాప్‌సింగ్ మద్దతుదారులు ఆయన నివాసానికి చేరుకుని.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇటీవల ప్రతాప్‌సింగ్.. రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రభుత్వాలు మారతాయి. కాలం మారుతుంది. రాహుల్‌గాంధీ అధికారంలోకి వస్తే.. బిజెపికి ఏం జరుగుతుందో ఊహించుకోండి. మేము ఇలాంటి వ్యాఖ్యలు చేసినందుకు ఎన్ని సోదాలు కావాలంటే.. అన్ని చేయవచ్చు. మేము భయపడము అని ప్రతాప్‌సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల అనంతరమే.. తాజాగా ఆయన ఇంటిపై ఇడి దాడులు నిర్వహించడం గమనార్హం.

# రాబర్ట్ వాద్రాకు ఇడి సమన్లు

**వేద న్యూస్,** న్యూఢిల్లీ : ప్రముఖ పారిశ్రామికవేత్త, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు తాజాగా మరోసారి సమన్లు జారీ చేశారు. హర్యానాలోని శిఖోపూర్ భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈ సమన్లు పంపారు. ఈ కేసులో ఏప్రిల్ 8వ తేదీన ఇడి మొదటిసారి సమన్లు జారీ చేసింది. అయితే ఆ సమన్లను వాద్రా దాటవేయడంతో.. ఇప్పుడు రెండోసారి సమన్లు జారీ చేసింది.కాగా, ఫిబ్రవరి 2008లో వాద్రా కంపెనీ ఒంకారేశ్వర్ ప్రాపర్టీస్ నుంచి రూ. 7.5 కోట్లకు గుర్గావ్‌లోని శిఖోపూర్‌లో 3.5 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసింది. ఈ భూమినే వాద్రా కంపెనీ సుమారు 58 కోట్లకు రియల్ ఎస్టేట్ కంపెనీ డీఎల్ఎఫ్‌కి విక్రయించింది.

వేద న్యూస్

బుధవారం ఏప్రిల్ 16, 2025



## హోంగార్డ్ సలీం సేవలు అమోఘం

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

పోలీస్ శాఖలో హోంగార్డుగా విధులు నిర్వహించి పదవి విరమణ పొందుతున్న సలీం సేవలు అమోఘంగా నిలుస్తాయని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫింగర్ ప్రింట్ విభాగంలో హోంగార్డ్ సలీంను ఎస్పీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. పోలీస్ శాఖలో హోమ్ గార్డ్ గా 34 సంవత్సరాల పాటు సేవలందిస్తూ పదవి విరమణ పొందడం అభినందనీయమన్నారు. పోలీస్ శాఖలో అందించిన సేవలు అనుభవాలు చాలా అవసరం ఉంటాయన్నారు. పదవి విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఏ.ఆర్ డీఎస్పీ శ్రీనివాస్, హోమ్ గార్డ్ ఆర్.ఐ శ్రీనివాస్, హోమ్ గార్డ్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించింది. మృతుడి వయసు సుమారు 30-35 సంవత్సరాల వయస్సు ఉంటుంది. దీనిని ఒక పశువుల కాపరి గమనించి, స్టేషన్ మాస్టర్ కు సమాచారం అందించగా వారు రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దాంతో సంఘటన స్థలానికి మిర్యాలగూడ రూరల్ పోలీసులు చేసుకొని మృతదేహాన్ని పరిశీలించగా మృతుడు రెండు మూడు రోజుల క్రితం టవల్ తో ఉరి వేసుకున్నట్లుగా ఉందని అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహం పక్కన ఒక చొక్కాలో 12.04.2025 నాడు సికింద్రాబాద్ నుండి సెరామ్ (కర్ణాటక)కు రైల్వే టికెట్ దొరికింది. మృతదేహాన్ని మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ సీఐ నాగ దుర్గాప్రసాద్ తెలిపారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తించినట్లయితే మిర్యాలగూడ రూరల్ ఎస్ ఐ 8712670189, మిర్యాలగూడ రూరల్ సీఐ 8712670151 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు రూ.20.19 కోట్లు విడుదల

**మొదటి పేజీ తరువాయి**

తెలిపారు. నిర్మాణం పూర్తైన వెంటనే బేస్ మెంట్ పూర్తైన తర్వాత లక్ష రూపాయిలు, గోడలు పూర్తైన తర్వాత 1.25 లక్షల రూపాయిలు, శ్లాబ్ పూర్తిచేసుకున్న తర్వాత 1.75 లక్షల రూపాయిలు, ఇల్లు పూర్తైన తర్వాత మిగిలిన లక్ష రూపాయిలు విడుదల చేస్తామని వివరించారు. బేస్‌మెంట్ గాని గోడలు గాని శ్లాబ్‌గాని నిర్మాణం పూర్తిచేసుకుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్దిదారులే ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా కూడా డబ్బులు లబ్దిదారుల ఖాతాలో జమచేస్తామని తెలిపారు. కనీసం 400 ఎస్ఎఫ్ టికి తగ్గకుండా 600 ఎస్ ఎఫ్‌టీకి మించకుండా లబ్దిదారులు ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ మరింత వేగవంతం చేయడం, అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమన్వయం ఉండేలా ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నామని తెలిపారు.



## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి


**వేద న్యూస్, హైదరాబాద్ :**

ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. శంషాబాద్ లోని నోవాటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సీఎల్పీ సమావేశంలో సీఎం.. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలతో మాట్లాడారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠాన నిర్ణయమే ఫైనల్ అంటూ తన అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగంలేదన్నారు. జనంలోకి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించి ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచాలన్నారు. పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారని స్పష్టం చేశారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కొన్ని సమస్యలకు తమ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని సీఎం పేర్కొన్నారు. సన్నబియ్యం పథకం ఒక అద్భుతమని ఆనాడు రూ.2 కిలో బియ్యంలా ఇప్పుడు సన్నబియ్యం పథకం శాశ్వతంగా గుర్తుండే పథకమని సీఎం వివరించారు. భూ భారతిని రైతులకు చేరవేయాలన్నారు. దేశంలోనే ఇందిరమ్మ ఇండ్ల పథకం ఆదర్శంగా నిలిచిందని క్షేత్ర స్థాయిలో నిజమైన లబ్ధిదారులకే అందాలని దీన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశానికి పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు.



FIRST INFORMATION REPORT
(Under section 173 and 176 BNSS)

మరణించిన బత్తిని చంద్రశేఖర్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన మిల్స్ కాలనీ పోలీసులు



జయశ్రీ అనే మహిళ మిల్స్ కాలనీ పోలీసులకు చేసిన ఫిర్యాదు



GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
Government of Telangana
Department of Medical & Health
DEATH CERTIFICATE
Name : BATHINI CHANDRA SHEKAR
HYDERABAD

మృతుడు బత్తిని చంద్రశేఖర్ డెత్ సర్టిఫికెట్

# ‘ఆత్మ’పై కేసు!

- 9 ఏండ్ల క్రితం మృతిచెందిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్
- ఆత్మ వచ్చి ఓ స్థలం హద్దురాళ్లు ధ్వంసం చేసి వెళ్లిందా?
- దీనిపై మృతుడి కుటుంబీకులు ప్రశ్నిస్తే.. ‘మాతో రూల్స్ మాట్లాడుతవా?’ అంటూ ఎదురుసమాధానాలు
- మిల్స్ కాలనీ పోలీసుల పని తీరుపై ప్రశ్నలు

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

‘ఆత్మ’పై కేసు!’ అవునండీ.. మీరు చదివింది నిజమే.. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు.. ఓ ఆత్మపై కేసు నమోదు చేశారా? అనే అనుమానాలు ఇది చదివాక మీకు కలగొచ్చు.. మీ సందేహం నిజమేనండోయ్.. ఓ కేసులో మిల్స్ కాలనీ పోలీసులు ఆత్మపై ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారు.! 9 ఏండ్ల క్రితం మృతి చెందిన వ్యక్తి ‘ఆత్మ’ వచ్చి ఓ స్థలం హద్దురాళ్లు ధ్వంసం చేసి వెళ్లిందే ఏమో మరీ.. ఇక ఆ సమయంలో ఆత్మ అలా చేస్తున్న సంగతి బహుశా.. సదరు ఖాకీలకు మాత్రమే కనబడిందో..! ఏమో తెలియదు కానీ, వారి డ్యూటీ వారు నిర్వహించారోచ్..!

కేసు వివరాల్లోకెళితే.. జయశ్రీ అనే మహిళ 17 జనవరి 2025న తమ స్థలంలోకి ఐదుగురు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి హద్దురాళ్లను ధ్వంసం చేసి తనను చంపుతానని బెదిరించారంటూ.. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో 21 జనవరి 2025న సాయంత్రం 7:10 గంటలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిల్స్ కాలనీ పోలీసులు 21 జనవరి 2025న సాయంత్రం 7:30 గంటలకు ఐదుగురు వ్యక్తులపైన 324(4),329(3),351(2), r/w 3(5) బీఎన్ఎస్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇంతవరకు బాగానే ఉందనిపించొచ్చు. కానీ, అసలు సంగతి ఏమిటంటే.. ఎఫ్ఐఆర్‌లో బత్తిని చంద్రశేఖర్ అనే వ్యక్తి పేరును పోలీసులు నమోదు చేశారు. సదరు వ్యక్తి మృతి చెంది తొమ్మిదేండ్లు గడుస్తోందని.. అసలు ఆయన పేరు ఎలా ఫైల్ చేస్తారని అడిగామని, ఈ విషయమై మిల్స్ కాలనీ పోలీసులను అడిగితే.. ‘పోలీసులతోనే రూల్స్ మాట్లాడుతావా?’ అంటూ సమాధానం ఇచ్చారని, దాంతో పోలీసు ఉన్నతాధికారిని సంప్రదించామని చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు వెల్లడించారు.

### ఆత్మఘోషను సైతం ప్రశ్నిస్తారేమో..!?

ఒకవేళ మరణించిన బత్తిని చంద్రశేఖర్ ఆత్మఘోష మాట్లాడితే.. ‘అయ్యా నా పేరు బత్తిని చంద్రశేఖర్.. నేను మరణించి తొమ్మిది ఏండ్లు అవుతోంది. నేను 17 జనవరి 2025న భూమి మీద లేను. అలాంటప్పుడు నేను వెంచర్‌లోకి అక్రమంగా ఎలా ప్రవేశిస్తాను. హద్దురాళ్లను ఎలా ధ్వంసం చేస్తాను.. కనీసం విచారణ లేకుండా.. నాపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి నా కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టడం సరికాదు. దయచేసి మరోసారి విచారణ చేసి నాపై చేసిన ఎఫ్ఐఆర్‌ను తొలగించాలి’ అని పోలీసులను వేడుకుంటేందేమో మరి..!.. ఒకవేళ అలా రిక్వెస్టు చేసినా సదరు ఖాకీలు.. తమతోనే ‘రూల్స్ మాట్లాడుతావా?’ అంటూ ఆత్మను సైతం ఎదురుప్రశ్నిస్తారేమో..!?

### ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వేడుకోలు

కాసులకు కక్కుర్తిపడి కొంత మంది పోలీసులు వ్యవహరిస్తున్న తీరుతో మొత్తం పోలీస్ శాఖకే మచ్చ పడుతోందని కొందరు ఆరోపిస్తున్నారు. కనీస విచారణ లేకుండా ఇష్టమొచ్చినట్టుగా ఖాకీల పనితీరు ఉంటోందని, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కొన్ని పీఎస్‌లలో ఇష్టారాజ్యంగా తతంగాలు నడుస్తున్నాయని బలంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ఉన్నతాధికారులు దృష్టి సారించి.. ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

# ఏప్రిల్ 17న మందకృష్ణ మాదిగకు సన్మానం

### పుల్ల ఫ్యామిలీస్ ఆధ్వర్యంలో నిర్వహణ

**వేద న్యూస్, కమలాపూర్ :**



గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తన ఆశయంగా భావించి తన భుజానికి ఎత్తుకొని అహర్నిశలు నిర్విరామంగా కృషిచేసి, ఎన్నో సుదీర్ఘమైన పోరాటాలు చేసి చివరకు ఎస్సీ వర్గీకరణను సాధించి విజయ బావుటా ఎగురవేసి జాతికి, జాతి ప్రజలకు భవిష్యత్తునిచ్చిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ కు ఏప్రిల్ 17న హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ఉమామహేశ్వరి ఫంక్షన్ హాల్ లో పుల్లా ఫ్యామిలీస్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయ నున్నట్లు ఆల్ ఇండియా యూనివర్సిటీ ఎంప్లాయిస్ కాన్ఫెడరేషన్ ఉపాధ్యక్షులు డా. పుల్ల శ్రీనివాస్ తెలిపారు. కమలాపూర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 17న మందకృష్ణ మాదిగ తో పాటుగా ఉద్యమానికి ఊపునిచ్చిన, ఉగ్రూతలూగించిన, ఊపిరి పోసిన కళాకారులైనటువంటి ఏపూరి సోమన్న, వరంగల్ శ్రీనివాస్, దరువు ఎల్లన్న, దరువు అంజన్న, మిట్టపల్లి సురేందర్, అంతడుపుల నాగరాజు, రామంచ భరత్, గిద్దె రాంనర్సయ్య, గోల్కొండ బుచ్చన్న లకు మందకృష్ణ చేతుల మీదుగా సన్మానం చేయించనున్నట్లు, అంతేకాకుండా ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి గత 30 సంవత్సరాల నుండి తోడ్పాటు అందిస్తూ వస్తున్న అన్ని కుల సంఘాలకు కూడా మందకృష్ణ మాదిగ తో సన్మానం చేయించడానికి నిర్ణయించినట్లు తెలిపారు. డా. బి.ఆర్ అంబేద్కర్ మాదిరిగానే మందకృష్ణ మాదిగ కూడా అందరివాడని, ఎస్సీ వర్గీకరణ విజయం సాధించిన తర్వాత మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ అన్ని కుల సంఘాలు సహకరిస్తేనే మా ఉద్యమం ఇన్నేళ్లు అప్రతిహతంగా కొనసాగిందని ప్రకటించారని, ఉద్యమానికి మాట సాయం కావచ్చు, ప్రత్యక్ష సాయం కావచ్చు, పరోక్ష సాయం కావచ్చు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తూ వచ్చిన బీసీ కులాల వారికి, ఓసి కులాల వారికి కూడా మందకృష్ణ మాదిగ చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమం విషయంలో రాజకీయ నాయకులు రాజకీయం చేయవద్దనీ, తాము ఏ పార్టీకి, ఏ రాజకీయ నాయకుడికి వ్యతిరేకం కాదని, తాము కేవలం ఒక ఎజెండా రూపొందించుకొని నిర్విరామంగా, అలుపెరుగని శ్రామికుడిలా జాతి కోసం అహర్నిశలు పాటుపడి జాతి ప్రజలకు భవిష్యత్తు కల్పించడమే కాకుండా సమాజం కోసం ఎన్నో పోరాటాలు చేసి, సమాజంలో మార్పు తీసుకువచ్చి సమాజ హితానికి కృషిచేసిన గొప్ప వ్యక్తి అయిన మందకృష్ణ మాదిగను గౌరవించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం పుల్ల ఫ్యామిలీస్ ఆధ్వర్యంలో చేపట్టినట్లు డా. పుల్ల శ్రీనివాస్ తెలిపారు. కావున హనుమకొండ జిల్లా లోని అన్ని మండలాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున మందకృష్ణ మాదిగ సన్మాన కార్యక్రమానికి హాజరై, విజయవంతం చేయాలని, సమాజం కోసం పనిచేసిన వారిని తప్పకుండా సమాజం గుర్తిస్తుంది, గౌరవిస్తుంది అనే గొప్ప సందేశాన్ని సమాజంలోకి పంపాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## మంత్రివర్గ విస్తరణ ఆలస్యం!

**మొదటి పేజీ తరువాయి**

సమైకరణలకు అనుగుణంగా సర్దుబాటు చేయడం అధిష్టాన వర్గానికి కూడా కత్తి మీద సాములా మారింది. పార్టీ అధికారంలోకి రాకముందు అవసరాన్ని బట్టి గెలుపు గుర్రాలకు మంత్రి పదవులు ఎర్ర చూపి ఆశపెట్టారు. మంత్రి మండలి లోకి తీసుకోవడానికి భౌగోళిక సామాజిక కుటుంబపరమైన సమీకరణలు అడ్డుపడుతున్నాయని కాంగ్రెస్ అధిష్టానం మడమ తిప్పింది. ఎన్ని రోజులు తమకు మంత్రి పదవులు వస్తాయని చెప్పుకుని తిరిగిన వారు భంగపడి ఆగ్రహం వ్యక్తం చేయడం మొదలుపెట్టారు. తాజాగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనకు మంత్రి పదవి రాకుండా తమ జిల్లాకు చెందిన మంత్రి జానారెడ్డి అడ్డుపడుతున్నాడని ఆయన అధిష్టానానికి లేఖ రాయడం వల్లనే తనకు పదవి రాకుండా పోయిందని బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ జయంతి సాక్షిగా సోమవారం నాడు మా కార్యకర్తలకు అన్యాయం చేసినట్లే అని బహిరంగ విమర్శలు చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లా నుండి మంత్రివర్గంలో అసలు ప్రాతినిధ్యమే లేదు. ప్రస్తుతం ఆరు ఉమ్మడి జిల్లాల నుంచి మాత్రమే మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లభించింది. ఖమ్మం జిల్లా నుంచి అత్యధికంగా ముగ్గురు, మంత్రులకు చోటు దక్కగా, మహబూబ్నగర్, నల్లగొండ కరీంనగర్ ఉమ్మడి జిల్లాల నుంచి ఇద్దరు వేసి మంత్రులు ఉన్నారు, మెదక్ జిల్లా నుండి దామోదర రాజనర్సింహ వరంగల్ నుండి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇటీవల సినీనటి విజయశాంతికి బీసీ కోటాలో మంత్రి పదవి ఏఐసీసీ కోటాలో ఇవ్వాలని కసరత్తు చేస్తున్నారు. దీంతో సీనియర్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. చూడాలి మరి అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుందో...

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073